
ఓ.కామేశ్వరి

# పేదవాడి ప్రేమ



నల్లటి నున్నటి గచ్చు మీద ముత్యాలు విరజిమ్మినట్టుంది ఆకాశం. నల్లటి పెద్ద చెరువులో విరిసిన ఒకే ఒక కలువలా తోడు లేదన్నట్టు బిక్కు బిక్కుమని చూస్తూ చంద్రుడు దిగులుగా నెమ్మదిగా కదులుతున్నాడు. కునికిపాట్లు పడుతున్న గూర్ఖా వుండి వుండి వొక్క సారి మెలకువ తెచ్చుకుని ఆటెన్షన్‌లో నిలబడ్డట్టు తలవాల్చి స్తబ్ధుగా ఉన్న చెట్లు వొక్కసారి హడావిడిగా పిల్లగాలులు వీచి మళ్ళీ కదలకుండా ఊరుకున్నాయి. నల్లటి త్రాచులా నిగనిగలాడుతూంది తార్రోడ్డు ఆ వెన్నెల్లో. కక్కటిల్లి యేడ్చే పసివాడి నోటికి పాలందించగానే యేడుపు మానినట్టుంది ఆ వీధి నిశ్శబ్దం.

ఆ నల్లటి నున్నటి రోడ్డుమీద తెల్లటి మెరిసే కారు వొకటి నెమ్మదిగా, అతి నెమ్మదిగా, తల్లిమీద అలిగిన పసివాడు అమ్మ పిలిస్తే గునుస్తూ ఒక్కో అడుగు జార్చినట్టు వెడుతూంది. కారులో నల్లని స్టీరింగ్ మీద తెల్లగా, అతి తెల్లగా, తామర తూడులా కోమలమైన నల్లని స్క్వేర్ వాచ్ చేయి, స్టయిలుగా నడుపుతూంది.

గాలికి రెపరెపలాడే ఆమె పల్చటి షిఫాన్ గులాబిరంగుచీర, గులాబి రేకులకంటే మెత్తగావున్న ఆ చీర చెంగు, ప్రక్కనే వున్న ప్రియునిముఖం వొక్కసారి కప్పేసి, ఉక్కిరిబిక్కిరి చేసేసి, తప్పుకి క్షమాపణలాగా, పరిహారార్థంగా చల్లని, మెత్తని, సన్నని సంపెంగ అత్తరు వాసన అతనికి అందిచ్చి తొలగిపోతూంది ఏ మెరగని దానిలా !

'రాణీ!' మెల్లిగా మెత్తగాఏవో లోకాల్లో తేలిపోతూ అన్నాడతను.

'ఊఁ!' గోముగా ముద్దుముద్దుగా గునిసింది రాణి.

'రాణీ... రాణీ' అన్నాడు మళ్ళీ. 'అమ్మా', 'అమ్మా' అన్నమాట తప్పించి మరోటిరాని పసివాడు ఏదో చెప్పడానికి పడే ఆరాటం అతనిది.

'ఊఁ' నవ్వింది మబ్బుల్లో మెరిసినట్టు. 'రాజా!...నా పిచ్చిరాజా!' అంటూ చేతిని అతని క్రాపులో అల్లరిగా కదిపింది.

'రాణీ... రాణీ, నువ్వూ నేనూ యిలా... యిలా ... యెన్నటికీ యిలానే వుండిపోతే...' ఆమె మెడ దగ్గిర మొగంతో అనుముతూ మెల్లిగా అన్నాడు.

'ఊఁ' మళ్ళీ నవ్వింది రాణి.

'అబ్బ! ఏమిటా 'ఊ' భాష? ఏదన్నా మాట్లాడు !' మురిపెంగా అన్నాడు.

'మాటలెందుకు? ఇలాగే వుండిపోదాం, ఈ నిశ్శబ్దంలో, ఈ వెన్నెల్లో, ఈ చల్లగాలిలో, ఈ సువాసనలతో, ప్రేమలో, పారవశ్యంలో ... వేరేం మాట్లాడవద్దు రాజా!' బొంగురు పోయినట్టున్న గొంతుతో తనలో తాననుకున్నట్టుంది రాణి.

'రాణీ, యిలా యెన్నాళ్ళు?... ఈ తపస్సు! ఎప్పటికి విముక్తి? ఎన్నాళ్ళిలా కలయికలోని యెడబాటు అనుభవిస్తూ వేగాలి? ఎన్నాళ్ళకి దేవి కటాక్షించదేం?' దైవదర్శనానికి క్యూలో నిల్చొని నిల్చొని విసిగెత్తిన తిరుపతి భక్తుడిలా ఆవేదనగా అన్నాడు.

'భక్తా! త్వరలోనే నీ అభీష్టం సిద్ధించును!'

'హాస్యం గాదు రాణీ! మీ నాన్నకి చెప్తానన్నావు. చెప్పావా?'

'లేదు. సమయంకోసం చూస్తు

న్నాను. ఇంక ఎంతోకాలం ఆగమలే!'

'నన్ను చాలా దూరం తీసుకొచ్చావు రాణీ. ఇంకిప్పుడు నువ్వు లేకుండా ఉండడమంటే ఏమిటో అసాధ్యమనిపిస్తుంది. అలాగని మీ నాన్న మనమధ్య యీ అంతస్థులన్నీ మరిచి మన పెళ్ళికి ఒప్పుకుంటారా అన్నదీ సందేహమే!'

'డోంట్ బి సిల్లీ, రాజా డియర్! మా నాన్నకి నేనొక్కతెనే గారాలకూతురన్న సంగతిమర్చిపోతున్నావు! నామాట జవదాటుడు. నా యిష్టాన్ని వ్యతిరేకించే సాహసం ఆయన యెన్నడూ చేయలేదు, చెయ్యడు! కాబట్టి, ఇంక బుద్ధిగా యింట్లోకి వెళ్ళి నిద్రపో' దేశవాళీ చలన చిత్రాల్లో నాటు కథానాయకుడు, నాయికగడ్డం సున్నితంగా ఒకే ఒక వేలుతో యెత్తి పట్టుకున్నట్టు, అతనిగడ్డంపట్టి యెత్తి కళ్ళలోకి ప్రేమగా చూసింది.


'ఓకే, గుడ్ నైట్ రాణీ!' అంటూనే సున్నితంగా రాణి చెయ్యి నొక్కిపట్టి దిగాడు రాజగోపాల్.

'గుడ్‌నైట్ రాజ్!' రాజ్‌ని డ్రాప్ చేసి, వొక్క వూపుతో కారు ముందుకు వురికించి మాయమైంది రాణి, రాజలా నిలబడి చూస్తూండగానే!

◆ ◆ ◆

ఊరికి దూరంగా యెత్తయిన కొండలమీద, ఎర్రని గుట్టలమీద, మనుష్యులకి, గోలకి, మురికికి, ఈగలకి, అన్నింటికి దూరంగా అంతస్థుకి చెందిన వాళ్ళకి, అంతస్థులుండే భవనాలుంటాయి. చెల్లా చెదరుగా విసిరిన గింజల్లాగా అక్కడొకటి అక్కడొకటి ఉంటాయి. ఒకదానితో ఒకదానికి సంబంధం లేదన్నట్లు, వెలేసినట్టు మీతో మాకేంసంబంధంఅన్నట్టు విడివిడిగా, యెవరి ఆధిక్యం వారు చూపించుకోడానికన్నట్టు, ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్టు ఒకదాన్నిమించి ఒకటి వెలుస్తాయి ఆ కొండల తలలమీద. అందులో అన్నింటికంటె యెత్తయిన చోట గుమాస్తాలమధ్య కలక్టర్లా, నక్కలు తోడేళ్ళమధ్య సింహంలాగ, ఠీవిగా తలెత్తి నిల్చొనుంటుంది ఓ యెర్ర రాళ్ళ బంగళా! అదే రాధారాణి నాన్న బంగళా!

ఆ బంగళాచుట్టూ భారీ ప్రహరీ గోడ వుంటుంది, మామూలు వాళ్ళకి అందనంత యెత్తున. అందమైన నగిషీలుచెక్కిన అల్యూమినియం రంగు గేటు. ఆ గేటుతెరిస్తే ఎర్రటిబాట. బాటకి రెండువైపులా విదేశీ, దేశవాళీ రంగురంగుల మొక్కలు, ఫౌంటెన్లు, సిమెంటు బెంచీలు, గార్డెన్ ఛెయిర్లు, క్రీపర్లు, పూపొదలు, అన్నీవుంటాయి. కాంటిలివర్ పోర్టికో, విశాలమైన వరండాలు,



నున్నటి స్తంభాలమీద ఎక్కించిన పూలతలు, లైట్ గ్రీన్ డిస్టెంపర్ కొట్టిన పెద్ద పెద్ద గదులు, ఎయిర్ కూలర్లు, మొజాయిక్ ఫ్లోరింగ్, ఫ్లోరసెంట్ దీపాలు, ఖరీదయిన పల్చని నైలాన్ తెరలు, మొహాలు కనిపించే పాలిష్‌వున్న నున్నటినల్లటి ఫర్నిచర్, తివాచీలు, ఫ్లవర్‌వాజ్‌లు, ఆయిల్ పెయింటింగులు, డన్‌లప్పిల్లోలు, ఫ్రిజిడైర్లు, రేడియోగ్రాములు, వాషింగ్ మెషిన్లు, టేప్ రికార్డర్లు, ట్రాన్సిస్టర్లు, హాట్, కోల్డువాటర్ బాత్‌లు, డైనింగ్ రూంలు, డ్రాయింగ్‌రూంలు, వెయిటింగ్ రూంలు, గెస్టురూంలు, నాలుగు రకాల ఫోనులు వగైరా, వగైరా అవసరమైన, అనవసరమైనవన్నీ వున్నాయి ఆ బంగళాలో! అవేగాక మెత్తగా మెల్లిగా జరజరాపాకే పాములాంటి పొడవైన ఇంపాలా కారు, రెండు దేశీకార్లు వున్నాయి రాణీ నాన్నకి! ఇంకా యేవేవో కంపెనీల్లో బోలెడు షేర్లున్నాయి ఇవన్నీవున్న రాధనాన్నకి బ్యాంకుల్లో పెద్ద మొత్తాలుంటాయని వేరే చెప్పక్కర్లేదుగా!

ఆ నాన్నకి ముద్దులపట్టి, గారాలచిట్టి, వరాలమూట, అపరంజి

బొమ్మ – రాధారాణి! నాన్నకి ప్రాణం రాణి! లేక లేక పుట్టిన యేకైక పుత్రిక! తల్లిలేని పసికూన! బంగాళాలకి, బ్యాంక్ ఎకౌంట్లకి, కంపెనీల షేర్లకీ, కార్లకి అన్నింటికి ఏకైక వారసురాలు!

రాణి డిక్షనరీలో సుఖమేగాని కష్టమన్న మాటేలేదు. పిక్‌నిక్‌లు, పార్టీలు, హాలీవుడ్ సినిమాలు, విలాసాలు, వినోదాలు అన్న మాట క్షణాలమీద జరిపించే తండ్రి, వంగి సలాములు జేసే నౌకర్లు, యివి మాత్రమే జీవితంలో వుంటాయనుకునే అమాయకురాలు! జీవితంలో దారిద్ర్యం, కుళ్ళు, మురికి, ఈగలు, యేడ్పులు, చావులు, పస్తులు, కొట్లాటలు, రోగాలు అంటే యేమిటో తెలీని ముగ్ధ!

రాజుతో పరిచయమయ్యాక, అతని యింట్లో కనీసం ఓ పదిగదులు లేవని, సోఫాసెట్లు, కర్టెన్లు, డైనింగ్ టేబిల్స్, రేడియోలు లేవని విని, కని ఆశ్చర్యపోయింది. కనీసం ఒక స్టాండర్డ్ హెరాల్డ్ కారు, అధమం లాంబ్రెట్టా అయినా లేదని విని తెల్లబోయింది. రాజు నాన్నకి మూడువందల రూపాయలు జీతం అని విని మూడురూపాయల్లాంటి ఆ మూడువందలతో రాజ్ కుటుంబ సభ్యులు అరుగురు యెలా బ్రతుకుతున్నారా అని వింతగా చూసింది! రాణి నాన్నలాంటివాళ్ళు వెయ్యికి, మళ్ళీ మాట్లాడితే లక్షకి ఒకరుకూడా వుండరని రాజ్ చెప్పడం విని నిశ్చేష్టురాలైంది. భారతదేశ దౌర్భాగ్య స్థితికి జాలిపడింది, చింతించింది!

అలాంటి బంగారు పిచ్చుక రాణి ఆకాశమంతెత్తు అంతస్తుని మరిచి రాజ్‌నెలా కటాక్షించింది? తెలియాలంటే ప్రజలు షేక్స్పియర్ నాటకాల్నుంచి తెలుగు సినిమాలదాకా ఏన్నో పాత్రల్ని యెన్నో సన్నివేశాల్ని తరిచి పరిశీలించాలి; ప్రేమ గుడ్డిదన్న సూక్తి మర్చిపోగూడదు. రాణి చిరునవ్వుల పన్నీటి జల్లులకోసం, వాడి కత్తుల్లాంటి వాలు చూపుల సూటి తాకిడికోసం ప్రాకులాడే కన్‌వర్టిబుల్ కార్లున్నవాళ్ళు, బకింగ్‌హాంపాలెస్ లాంటి భవంతులున్నవాళ్ళు, టెర్లిన్‌సూట్లవాళ్ళు, మిట్టమధ్యాహ్నపు యెండలోంచి చీకటి గుయ్యారంలోకి అడుగుపెట్టినట్టు మొన్నే విదేశాల్నుంచి దిగినవాళ్ళు, చెక్కుల్తోనేగాని నోట్లతో నాణాల్తో వ్యవహరించి యెరుగని ఉన్నతోద్యోగులు, అసలు సిసలైన డింపిల్స్ విస్కీ తప్పించి సేవించి యెరగని విలాస పురుషులు, ప్రతీరాత్రి ఏ హొటలు నునుపు ఫ్లోర్ మీదనో సుందరాంగుల బిగి కౌగిలిలో గిపెట్టే సంగీతానికి లయగా అడుగులు జార్చనిదే ప్రొద్దుగడవని రసికులు, కత్తి కటారుల్తో గాకుండా దేవుడిచ్చిన చేతుల్తో తిండి తినడం

అందమున్లో ఆదివాసుల అలవాటుకు కున్న అత్యాధునికులు – యింత మందుండగా ఆవేవీ యేమిటో తెలియ. మిల్ యూరన్ చొక్కా, పర్ఖాలా పాంటుతో ఉదయాన్నే లేచి బుద్ధిగా కాలేజి పాఠాలు చదువుకునే రాజ్ రాణి ప్రేమని పొందడం యెలా సాధ్యపడింది? ఏమా కథ అని అడిగితే—

ఒంటిగాపోతున్న అబల, కుసుమ కోమలి, గులాబి రేకులాంటి జవ్వని, చెలికత్తెలు వెంటరాగా రెండో ఆట యింగ్లీషు సినిమా చూసి విలాసంగా కబుర్లు చెప్పుకుంటూ కిలకిలా నవ్వుకుంటూ, ఒక్కొక్క నెచ్చెలిని డ్రాప్ చేసి, యిళ్ళదగ్గిర దింపి, యింటికి తిరిగి వస్తుంటే, ఆ యెగుడు దిగుళ్ళ రోడ్‌లో, నిర్మానుష్యమైన నడిరాత్రి టైర్ బరస్టవడం, టైరు మార్చుకోలేని, కారు వదిలి నడవలేని నిస్సహాయస్థితిలో దిక్కులు వెతుకుతూ బిక్కుబిక్కుమని చూస్తున్న వేళ, రెండో ఆట సినిమానే చూసి మెల్లిగా ఓల్డ్ హార్స్ లాంటి సైకిల్ను వేధిస్తూ వస్తూన్న రాజ్, పౌరాణిక చలన చిత్రాల్లో శ్రీ మహావిష్ణువు పిల్చినా పిలవక పోయినా శిష్టరక్షణార్థం దర్శనమిచ్చినట్లు, ప్రత్యక్షమవడం, "ఏమండీ!" అని ఆమె అతి మధురంగా పలకరించి, చూపుల్తో కట్టేసి ప్రాధేయపడ్డం, అతడు ఆమెకి సహాయపడ్డమే తన జీవిత పరమావధిగా భావించి స్టెప్నీ మార్చడం, ఆమె అతనివంక కృతజ్ఞతతో నిండిన వాల్జూపు విసిరి, యింటిదగ్గిర విడవడం, మర్నాడు ఆదివారం తేనీటికి, ఆ తర్వాత వాహ్యాళికి ఆహ్వానించడం, అలా అలా కలుసుకున్న సమయాల్లో పురుషపుంగవు లెందర్లోనో కనబడని ఆకర్షణ ఆమెకి అతనిలో కనబడ్డం–అవీ రాణి ప్రేమాయణంలో నాందీ, ప్రస్తావనలు!

రాజ్ ముందు ముందు. రాణి లాంటి శ్రీమంతురాలు తనని తలచడం ఈ భూమ్మీద మానవాళి మనుగడని ఉఫ్ఫుని ఊదిపారేసే ఉపద్రవమేదో అని బెదిరాడు, జంకాడు, తబ్బిబ్బైయాడు, తన కెందుకనుకున్నాడు, ఆమెవంక చూడకూడదనుకున్నాడు; కాని విడవక వెంటబడ్డ రాణి ప్రేమవాహినిలో మునిగి తల మున్కలయాక షేక్స్పియరేమన్నాడు, కారల్ మార్క్స్ యేమన్నాడు, డి. హెచ్. లారెన్స్ యేమన్నాడు? అని ప్రశ్నించుకుని యిది ప్రగతివైపు మానవుడి పురోగమనంలో అతి ముఖ్యమైన మెట్టు, సర్వమానవ సౌభ్రాత్రానికి సాగే నిరంతర కృషికి పరాకాష్ఠ, పెట్టు

బడిదారీ వర్గాలమీద అభివృద్ధి నిరోధక శక్తులమీద, శ్రామికులు, కష్టపడి పనిచేసే మంచివాళ్ళు తీసే గట్టిదెబ్బ అనుకున్నాడు! అనుకొని ఈ ప్రేమని సాధ్యమైనంత త్వరలో పుష్పింపజేసి, ఫలింపజెయ్యాలనుకున్నాడు!

* * *

"వాట్!" రాణి నాన్న ఆశ్చర్యంతో తలమునక్క లయిపోయాడు హఠాత్తుగా రాణి చెప్పిన మాట విని.

"అవును. నాన్నా, నేను రాజ్‌ని పెళ్ళాడ్డానికి నిశ్చయించుకున్నాను. రాజ్‌ని తప్ప యింకెవ్వర్నీ పెళ్ళాడను!" మళ్ళీ రెండోసారి నొక్కి చెప్పింది.

ఎయిర్ కండిషన్డ్ గదిలో కూర్చున్నాగాని, ఇన్‌కంటాక్సు లెక్కల్లో చెమటలు గక్కేస్తున్న నృసింహారావుకి, ప్రహ్లాదుడు మొట్టమొదటి సారి "నారాయణా" అన్నప్పుడు హిరణ్యకశిపుడికి వచ్చినంత చిరాకు వచ్చింది.

"ఎవడువాడు? మొన్న మనింటికి టీ తాగిపోడానికి వచ్చినవాడేనా? ప్రేమించడానికి నీకా పర్లాఖా మొగం తప్పించి ఇంకెవడూ కనబళ్ళేదా? నిన్నిన్నాళ్ళు గాజు మేడల్లో, ఫోమ్ కుషన్ల మీద, యింపాలాకార్లో, డ్రాలన్ చీరల్లో నేల మీది దుమ్ము, గడ్డి, చెత్త అన్నింటికి దూరంగా దాచి పెంచానే, నీకీ పాడుబుద్ధు లెలా వచ్చాయి?"

తన పందొమ్మిదేళ్ళ జీవితంలో ఏనాడూ ఇంత కఠినంగా మాట్లాడి యెరగని నాన్నని చూసి రాణి మొదట నమ్మలేకపోయింది. ఆ తర్వాత కళ్ళలోకి నీళ్ళు చిమ్మాయి. తలదించుకొని కిటికీదగ్గరకి పరుగెత్తి ఊచలు పట్టుకుని బయటికి చూస్తూ వెక్కి వెక్కి యేడ్చింది.

"అదేమిటు దలా, సాంఘిక చిత్రాల్లో ఖండిత నాయికలాగా కిటికీ ఊచలు పట్టుకు యేడుస్తుండెందుకు? జుట్టుకాస్త విరబోసుకో చెల్లమ్మా! సరిగ్గా అతికినట్టుంటుంది!" విట్టు వేసి నవ్వాడు బుజ్జి.

రాణి మొగం లేతగులాబీరంగుది, ముదురు యెరుపయ్యింది. కళ్ళు నిప్పుకణాలయ్యాయి. ముక్కుపుటాలదిరాయి. చురుక్కున వెనక్కి తిరిగింది.

"సంతోషించాం గాని, నీ చచ్చు విట్టుకి నువ్వే నవ్వుకుంటూ కాసేపు బయట కూర్చో. నేను నాన్నతో మాట్లాడాలి."

నృసింహారావు ఎన్నడూచూడని రాణి కన్నీరు చూసి గిలగిల్లాడిపోయాడు. తల్లిపోయి నప్పట్నుంచి ఆమె కంటతడి పెట్టగూడదని ఆడింది ఆటగా పాడింది పాటగా పువ్వుల్లో పెట్టి పెంచాడు. ఆమె పంతం,

పట్టుదల ఆయనకి బాగా తెలుసు. ఏం చెయ్యడం? ఎలా నచ్చ జెప్పడం? అని తికమక పడుతున్న మ షికి బుజ్జిమాటలు కొంత ఊపిరి సలిపేలా జేశాయి. బుజ్జి ఆయనకి అన్నగారి కొడుకు, కుడిభుజం, ప్రిన్సిపల్ ప్రైవేట్ పర్సనల్ సెక టరీ, మంత్రి, సలహాదారు యింకా ఇలాంటి వెన్నో! దేవుడు తన దగ్గ రున్న తెలివితేటల్లో సగం బుజ్జి కిచ్చేసి మిగిలినవి మిగతా మానవు లందరికీ పంచిపెట్టాడని ఆయనకి గట్టి నమ్మకం.

'చూడు తల్లీ! నువ్వు కావా లంటే కొండమీద కోతిని తెస్తాను. కాని ఈ రాజేమిటమ్మా! అతను నీకు తగునా?' అల్లరిచేసే పిల్లకి మిఠాయి చేతిలో వుంచి బుజ్జగించి నట్టున్నాడు నృసింహారావు.

'నాకు కోతీవద్దు, కొండముచ్చూ వద్దు అతన్ని విడిచి నేనొక్క క్షణం వుండలేను. నేను బతకా లనుంటే అతన్ని అంగీకరించండి, లేదంటే...'

అదోలా నవ్వాడు ముసలాయన. మంచీ చెడ్డా తెలియని చిన్నపిల్లాడు మేడమీంచి దూకుతానని మారాం చేస్తుంటే నచ్చజెప్పలేకఅవస్థపడ్తూ, అసహాయతని దాచుకుంటూ చిరాగ్గా యేడవలేక నవ్వినలాంటి నవ్వు.

'రాణీ, రాజంటే నువ్వు ప్రెజంట్ చేసిన టెర్లిన్ టీ షర్ట్ తొడుక్కుని నీతో కార్లో తిరిగే వాడే?'

రాణి బుజ్జిని కొరకొరచూసింది. రాణి కంటికి బుజ్జి, హిందీసినిమాల్లో హీరో హీరోయిన్లు నాలుగయిదు డ్యూయెట్లు పాడుకున్నాక సహించ లేక, యింటర్వలయ్యాక విజృం భించే విలన్. తెలుగు జానపద చిత్రాల్లో రాజుగారి రాజ్యం కాజె య్యాలని యెత్తేసే రాజుగారి బావ మరిది!

రాణి మంచిచెడ్డలు, పినతండ్రి వ్యాపార లాభనష్టాలు, యింటి నౌకర్ల అజ్మాయిషీ అంతా తను లేనిదే తలక్రిందు లయిపోతుందని, బాబాయిలాంటి అమాయకుడు, రాణిలాంటి పసిపిల్ల ఇద్దరూ తను లేకపోతే ఈపాటికి నడివీధి పాలయ్యేవారని బుజ్జి ఊహ! తన విషయాల్లో జోక్యం కలిగించుకో వదని రాణి యెన్నోసార్లు చెప్పినా, ఏదో పసిది కోపంలో అన్నదని, 'గోతిలోకి దిగుతాను, విషం తిం టాను, నాయిష్టం!' అని యేచంటి దన్నాఅంటేమాత్రం పెద్దవాళ్ళూరు కుంటారా, ఊరుకోడం భావ్యమా అన్న ధోరణిలో మంచీ చెడ్డా తెలి సున్న బుజ్జి ఆమె మాటలు లెక్క చెయ్యడం మానేశాడు! అసలు బుజ్జికి రాణి అలా మంచినీళ్ళలా డబ్బు ఖర్చుచేసెయ్యడం, నానా అడ్డమైనవాళ్ళతో తిరగడం, వాళ్ళని

భార్య :- ఏమండీ! గాజు గ్లాసులూ, సాసర్లూ కొంటానని బజారు కెళ్ళి ఒట్టి సాసర్లే కొనుక్కొచ్చారేం? గ్లాసులు నచ్చలేదా?

భర్త :- ఏం గ్లాసులో! అన్ని షాపులూ చూశాను. అన్ని చోట్లా గ్లాసులు తిరగేసి నిలబెట్టారు. ఎందుకు పనికొస్తాయవి!

---

సినిమాలకి, పిక్నిక్‌లకి, పార్టీలకి తీసుకెళ్ళడం గిట్టదు! కాని ఏం చెయ్యడం? చెప్తే రాణి వింటుందా? నిర్లక్ష్యంగా వెళ్ళిపోతుంది. బాబాయికి చెప్తే 'అఁ, పోఁద్దూ, ఏదో చిన్న పిల్ల సరదా, ఈ డబ్బంతా దానిదేగా! ఇంకెవరున్నారు నాకు?' అంటాడు. అని ఆమెనలా నెత్తికెక్కించుకోడం బుజ్జి కిష్టంలేదు. ఎవరున్నారేమిటి? తనులేడూ? పూర్తిగా కాకపోతే సగమైనా తనకివ్వరాదూ? ఎప్పుడో పదిహేనేళ్ళప్పుడు వచ్చి అయన్నే అంటి పెట్టుకున్నందుకు ఆమాత్రం యిస్తే బాబాయి సొమ్మేంపోతుంది?

తిరగడానికి ఓ కారు, యింట్లో తిండి, ఖర్చుకి ఓ మూడు నాలుగొందలు తప్పించి యింకేం ఈయడంలేదు బాబాయి; ఇచ్చే లక్షణాలూ కనబడ్డంలేదు. కాబట్టే నిర్లక్ష్యం. అలాంటివాడే ఆమెకి భర్తయి వస్తే అతని పంట పండుతుంది. నయాపైసల మంచీ లెక్కబెట్టే రాజులాంటివాడు వస్తే అతని పని ఉత్తిదే! ఆమాత్రం గ్రహించగల సూక్ష్మబుద్ధి, బుజ్జి!

అందుకే రాణి తన తిరుగులేని నిర్ణయం ప్రకటించి బయటికి వెళ్ళాక తలపట్టుకు కూర్చున్న బాబాయిని నెమ్మదిగా ఊరడించాడు బుజ్జి

'నువ్వేం బాధపడకు బాబాయ్; ఇలాంటి రాజుల్ని వందమందిని వదిలిస్తాను. అసలు రాణి చుట్టుపట్ల మైలు వ్యాసార్థంలో యెక్కడా ఇలాంటి వెధవలు జేరకుండా అంతల ఉంచుతాను. ఆ సంగతి నా కొదిలేసి నిశ్చింతగా ఉండు'

'అదేదో త్వరగా చూడరా బాబూ! దాని ధోరణి చూస్తే నాకు పిచ్చెత్తుతోంది! గట్టిగా వద్దంటే యేంచేస్తుందో!... అన్నట్టు ఇలాంటి వన్నీ సాధ్యమైనంతవరకు సున్నితంగా చూడ్డం మంచిది! ఎలా నిబ్బరించుకొస్తావో!'


'అదంతా నీకెందుకు! నా చేతిలో పాతికవేలు పారెయ్యి; వాడి ప్రేమతిమ్మిరి వదిలిస్తాను!'

'పాతిక కాకపోతే యాభై పట్టుకెళ్ళు; కాని చేసేదేదో తొందరగా చెయ్యి.'

బుజ్జి నవ్వాడు. తన సమర్ధత మీద బాబాయి కింకా నమ్మకం కుదరనందుకు విచారించాడు తన బుద్ధి కుశలత, కార్య శూరత్వం ఈ ఒక్కసారి ప్రదర్శించి బాబాయి కళ్ళలో ఆకాశం అంత యెత్తు లేవాలనుకున్నాడు!

* * *


హెడన్సా




మూల వ్యాధులకు

ప్రతిచోట దొరుకును


మరో పదిరోజులు వాతావరణం స్తబ్ధుగా ఉంది. రాణి బుజ్జితో మాట్లాడటం మానేసింది. తండ్రితో కూడా పలకరిస్తే ముక్తసరిగా తప్పించి వేరే మాటల్లేవు. నృసింహారావు చాలా యిబ్బంది పడ్డాడు. బుజ్జి కేసి ఆత్రుతగా చూసేవాడు. 'నీకేం ఫర్వాలేదు' అని అభయహస్త మిచ్చేవాడు బుజ్జి

ఒకానొక సుప్రభాతాన యింకా నైట్ గౌనులోంచి బయటికి రాకుండానే, సోఫాలో వాలి బెడ్ టీ సిప్ చేస్తూ మార్నింగ్ ఎడిషన్ పేపరు తిరగేస్తున్న రాణికి నగరంలో వార్తల శీర్షిక కింద క్రితం సాయంకాలం యేదో చోట జరిగిన కొట్లాట వైనం కనిపించింది. అలాంటి వార్తలంటే యిష్టం రాణికి! సర్దాగా చదివింది. ఎవరో విద్యార్థి సైకిలుమీద అటు వెళుతున్నాడు. ఇద్దరు ముగ్గురు వ్యక్తులు ప్రక్కనున్న కల్లుపాకలో మస్తుగా తాగి అప్పుడే బయటికివచ్చి తందనాలాడుతున్నారు. ఆ అబ్బాయి గంట మ్రోగించాడు, నోటితో చెప్పాడు. కాని ఆ వ్యక్తులు లొంగలేదు. పైగా బూతులు తిట్టారు. ఆ అబ్బాయి సైకిలు దిగి వాళ్ళని అదిలించబోయాడు. కొట్లాట జరిగింది. జనం మూగారు. ఆ చీకట్లో సరిగ్గా ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. ఆ అబ్బాయికిమాత్రం బలంగా గాయాలు తగిలాయి. అస్పత్రికి

తీసుకెళ్తుంటే దారిలో మరణించాడు. ఆ అబ్బాయి పేరు రాజగోపాల్. వయస్సు యిరవై రెండేళ్ళు. కాలేజిలో చదువుతున్నాడు.

రాణి ఆస్పత్రికి పరుగెత్తింది. శవపరీక్ష జరుగుతోంది. తల్లిదండ్రులు యేడుస్తున్నారు. జనం "అయ్యో, పాపం!" అంటున్నారు. రౌడీ వెధవలని తిట్టిపోస్తున్నారు. తన రాజ్ యింక లేడు!

ఇంటికి తిరిగొచ్చింది. మెట్లమీద కనబడ్డాడు బుజ్జి. ఏదో అనాలనుకుంది. ఇంకేమిటో చెయ్యాలనుకొంది.

"ఇది చూశావా, రాణీ! ఎంత దారుణం! పాపం, రాజగోపాల్నెవరో కొట్టి చంపేశారు. నిన్న సాయంకాలమే మాట్లాడానతనితో నీ పెళ్ళి గురించి! ఇంతలో ఇలా అవుతుందని ఊహించనుకూడా లేదు! ఎంత ఘాతుకం!..." విచారం వ్యక్తపరిచాడు బుజ్జి.

కళ్ళలో నీరు చిమ్ముతూంటే మెట్లమీదికి పరుగెత్తింది రాణి. రెండురోజులు బయటికిరాలేదు; గదిలోకి తండ్రినికూడా రానియ్యలేదు. ఆ రెండురోజులూ పూర్తిగా శోకరసం అనుభవించింది.

మూడోరోజు తండ్రి లోపలికి వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. ఆ మెరకళ్ళు యింక నీళ్ళులేక యేడవనట్టు సిర్లిప్తంగా వున్నాయి.

"నువ్వు గెలిచావు నాన్నా! అవందించు!" అంది రాణి.

నృసింహారావు గొల్లుమన్నాడు. జరిగిందానికి బాధ వ్యక్తంచేశాడు. రాజంటే సానుభూతి ప్రకటించాడు. అతని కుటుంబానికి సహాయం చేస్తానన్నాడు బుజ్జిని యింటిలోనుంచి పంపించేశాడు.

♦ ♦ ♦

అదంతా జరిగి అయిదేళ్ళకి పైగా అయింది.

ఇప్పుడు రాణికి ఓ అందాల పాపాయి. ఏణర్ధం పాపాయి. పత్రికల్లో పుష్టికి, ఆరోగ్యానికి నమూనాగా కోట్ల విలువచేసే చిరునవ్వు చిందిస్తూ కనిపించే పాపాయిల్ని మించి పుష్టిగా, ఆరోగ్యంగా ఉల్లాసంగా వుంటుంది. మాటలు సరిగా రావు. ముద్దుముద్దుగా అమ్మని, నాన్నని మురిపిస్తుంది. ఆ మురిపాలంటే పాపనాన్నకి అంటే రాణి భర్తకి, అంటే కృష్ణరావుకి పంచప్రాణాలు, అందుకని, ఆ మురిపాల కోసం, ప్రతీ సాయంకాలం గుర్రమై పాపని లాన్ అంతా త్రిప్పుతాడు. వాళ్ళ వెనకాలే నడుస్తూ వాళ్ళిద్దర్నీ

[illegible]

చూస్తుంటే ఆనందంతో పరవశమయిపోతుంది రాధారాణి!

కృష్ణారావు అందగాడు వెయ్యి రూపాయల జీతగాడు. అన్నిటినీ మించి సరసుడు. అతన్ని కట్టుకున్న నెల్లాళ్ళకే రాణి తండ్రినీ, రాజునీ, ఇంకా రమ, బాల, లత, సుధ లాంటి వాళ్ళని చాలా మందిని మరిచిపోయింది. కావాల్సినప్పుడు తండ్రి రెక్కలు గట్టుకు వాలతాడు పాత దీపాన్ని రాయగానే భూతం ప్రత్యక్షమైనట్టు. అక్కర్లేకపోయినా వారానికో మూడు నాలుగుసార్లు ప్రత్యక్షమై వాళ్ళకేవేం లేవో వెతికిచూసి తెలుసుకొని మరుక్షణం తెచ్చిపెట్టాడు. రాధ, కృష్ణ నిలబడి మధ్య ఇద్దరూ చెరోచేతో పాపనిపట్టుకొన్న వాళ్ళ ఫామిలీ ఫొటో చూస్తే యెవరికన్నా క్రింద "ఆదర్శం" అని వ్రాయబుద్ధేస్తుంది!

ఓ వెన్నెలరాత్రి ఏక శయ్యాగతులైవున్న వేళ రాధ నడుంచుట్టూ చెయ్యేసి కృష్ణ మెల్లిగా అన్నాడు: "రాణీ! డార్లింగ్. నీకో సంగతి చెప్పాలి. ఇప్పుడు చెప్పాల్సిన అవసరం లేదనుకో, కాని మనమధ్య


## వరద బాధితులకు సహాయం చేయండి


"మునుపెన్నడూ" ఎరుగని కరువును గత రెండేళ్ళలో అసమాన శక్తితో మనం ఎదుర్కొన్నాము. ఇప్పుడు ఉద్ధృతమైన వరదల వలన దేశంలోని చాలా ప్రాంతాలలో సోదర ప్రజలు నిలువనీడ లేకుండా వున్నారు. వారికి మన సహాయం కావాలి. ఆపదలో వున్న స్త్రీ పురుషులకు, పిల్లలకు కావలసిన సహాయం అందజేయటానికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి ఉదారంగా విరాళమివ్వమని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను."

— ఇందిరాగాంధీ

ప్రధాన మంత్రి
జాతీయ సహాయనిధికి
ధారాళంగా విరాళమివ్వండి

విరాళాలను
ఈ క్రింది అడ్రసుకు పంపండి.
సెక్రటరీ,
ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి
ప్రధానమంత్రి సచివాలయం,
న్యూ ఢిల్లీ.

DAVP 67/F4




యెలాంటి అరమరికలూ వుండకూడదు. అందుచేత నీకా సంగతి చెప్పేస్తే నాకేదో దించినట్టవుతుంది! నేను కాలేజీలో వుండగా ఓ అమ్మాయికి ఉత్తరాలు వ్రాస్తూండేవాడిని. ఇద్దరం యేమేమిటో వ్రాసుకునేవాళ్ళం! చివరికి ఆమెకి పెళ్ళవగానే మా ప్రేమ ఉత్తరాలతోనే ముగిసిపోయింది... యేమిటో, ఇప్పుడదంతా చూస్తే చాలా సిల్లీగా ఉంటుంది. ఆ ప్రేమలూ, ఆ కబుర్లూ ఏదేమిటో తెలియని పసితనం గదూ ?'

'అవును. ఎంత సిల్లీగా ఉంటుంది ఇప్పుడాలోచిస్తే! రాజగోపాల్ అని ఓ ముతక ఖద్దరు అబ్బాయిని కార్లో సినిమాలకీ షికార్లకీ తిప్పేదాన్ని కొన్నాళ్ళు! రెండు నెలలు కాకుండానే అతగాడు యెవళ్ళో రౌడీలతో తగువు పెట్టుకొని దెబ్బలుతిని మరో లోకానికి వెంచేశాడు!... ఇప్పుడని పిస్తుంది! అప్పుడనుకున్నవన్నీ కొంపదీసి నిజమైయుంటే ... ఎంత పోగొట్టుకొనేదాన్నో!' మత్తుగా అంటూ కళ్ళు మూసుకొని తలని మెడకి, భుజానికి మధ్య యిరికించి బలంగా హత్తుకుంది. ఆమెకి నిజంగానే ఏదో బరువు దించినట్టు తేలికయింది మనసు, ఆ సంగతి అతనికి చెప్పేశాక.

□□□